క్లుప్తంగా

వైద్యులు దేవుళ్లతో సమానం

నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు



నెహ్రూనగర్: ఆపత్కాల సమయంలో ప్రాణాలను నిలిపే వైద్యులు దేవుళ్లతో సమానమని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా సంపత్ నగర్‌లోని శ్రీ రామక్రిష్ణ శిశు విద్యా మందిర్‌లో పాఠశాల పూర్వ విద్యార్థి అయిన డాక్టర్ రామ కిషోర్ అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీ రామ కృష్ణ శిశు విద్యా మందిర్ పూర్వ విద్యార్థి వైద్యునిగా స్థిరపడటం ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ పీవీ రామశాస్త్రి, ప్రిన్సిపాల్ పీవీ శ్రీనాథ్ ప్రముఖ యురాలజిస్ట్ కేఎస్ఎన్ చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీలకు 34శాతం రిజర్వేషన్ కొనసాగించాలి



నెహ్రూనగర్: జనాభా దామాషా ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు కొనసాగించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కుల జనగణన చేపట్టి స్పష్టీకరించాలని కోరారు. ప్రస్తుత గణాంకాల ప్రకారం బీసీ లు 52% శాతంగా ఉన్నారని.. ఈ దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలలో 34% శాతం రిజర్వేషన్‌ను అమలు పరచాలన్నారు. బీసీల పక్షపాతి, బీసీల ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో బీసీలకు అండగా ఉండాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం ఈ రిజర్వేషన్‌పై ఒక కమిటీ వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, పూర్ణ చంద్ర, గోపి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య వృత్తితో నిస్వార్థంగా పనిచేసే అవకాశం



గుంటూరు మెడికల్: అంకిత భావం, పేద రోగులకు నిస్వార్థంగా సేవ చేసే భాగ్యం కేవలం వైద్యులకు మాత్రమే లభిస్తుందని ఆస్పత్రి గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది డాక్టర్ కిరణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీటీకే రెడ్డిలను డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ, డాక్టర్ రమేష్, డాక్టర్ కిరణ్ కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ డయేరియా వ్యాధి సోకి ప్రజలు ఇబ్బందులు పడిన సమయంలో వైద్యులు కష్టపడి పేద ప్రజల ప్రాణాలను కాపాడారని గుర్తు చేశారు. కార్డియో థొరాసిక్‌లో శస్త్ర చికిత్సలు విజయవంతంగా చేస్తున్నామన్నారు. రోగులకు సేవలు అందించే విషయంలో అసిస్టెంట్ ఆర్ఎంఓల పాత్ర ఎంతో కీలకమన్నారు.

దంత వైద్యుల పోస్ట్‌లను భర్తీ చేయాలి

ఏపీ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సతీష్



గుంటూరు మెడికల్: జనాభాకు అనుగుణంగా డెంటిస్టుల నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కృష్టాపురపు సతీష్ కోరారు. సోమవారం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోవిడ్‌లాంటి అత్యవసర సమయంలో రోగుల ప్రాణ రక్షణ కోసం అన్ని విభాగాలతో పాటు డెంటిస్టులు విభాగం కూడా ఉన్నతమైన వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. అప్పటి ప్రభుత్వం మిగిలిన విభాగాలకు ఇచ్చినట్లు సర్వీస్ వేయిటేజ్ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర నాయకులు గౌరీ శంకర్ మాట్లాడుతూ దంత వైద్యుల సంఖ్య కేవలం పదుల సంఖ్యలో ఉందన్నారు. నూతన ప్రభుత్వం శాశ్వత నియామకాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ డెంటిస్టులకు సకాలంలో ప్రమోషన్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీహర్ష, రాష్ట్ర కార్యదర్శి ఆనంద ప్రసాద్, హిమబిందు, హిమస్ విష, నాగవాణి, హరినాథ్, నరేష్ వెంకటరెడ్డి, గోపి, రైసా, ఉదయ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలపై వెంటనే స్పందించండి

- తాగునీటిని నిర్మాణ అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు
- జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో తాగునీటి సరఫరాపై అందే ఫిర్యాదులు, అర్జీలను వెంటనే పరిష్కారించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ముందుగా గత సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసల్ సిస్టం)కు అందిన ఫిర్యాదులు, అర్జీలు పరిష్కారంపై విభాగాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. తాగు నీటిని పలు నిర్మాణ పనులకు తరలిస్తున్నారని, సదరు ఫిర్యాదులను తక్షణం ప్రత్యేకంగా పరిశీలించి, బాధ్యులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే ప్రజల నుంచి పీజీఆర్ఎస్‌కు అందే ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం అందే ఫిర్యాదుల పరిష్కార నివేదికను తదుపరి వారం జరిగే సమావేశంలో అందించాలని చెప్పారు. ఫిర్యాదులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను ఆయా విభాగాధిపతులు పరిశీలించాలని, విభాగాల వారిగా అర్జీల పరిష్కారానికై ప్రత్యేక సిబ్బందిని కేటాయించుకోవాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలన్నారు. సమస్య పరిష్కారానికి ముందు, తరువాత ఫోటోలు జత చేయాలన్నారు. సచివాలయ కార్యదర్శులు విభాగాల వారిగా తమ సచివాలయం పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌కు 55 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 16, ఇంజినీరింగ్ విభాగానికి 21, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, ఉపా సెల్ విభాగానికి 2, అకౌంట్స్ విభాగానికి 6 చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఎస్ఈ శ్యాంసుందర్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్ఎన్ ప్రసాద్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీసీపీలు, ఏసీపీలు, ఈఈలు, ఆర్ఓలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

3, 4 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: నగరంలో మెరుగైన తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయిన్ పంపింగ్ లైన్ల మీద గుర్తించిన లీకులకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. సంగం జాగర్లమూడి హెడ్ వాటర్ వర్క్స్ నుంచి గుంటూరు నగరానికి తాగునీరు సరఫరా చేసే 685 ఎం ఎం డయా పంపింగ్ మెయిన్ లైన్‌పై ఫిల్టరేషన్ ప్లాంట్ వద్ద లీకులు ఏర్పడినట్లు తెలిపారు. దీంతో తాగునీరు వృథా అవుతుందన్నారు. ఫిల్టరేషన్ ప్లాంట్ పూర్తిగా నిలుపుదల చేయాలని, ఈ నెల 3న ఉదయం సరఫరా తదుపరి నులు చేపట్టడానికి ఇంజినీరింగ్ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారని తెలిపారు. మరమ్మతుల వల్ల బుధవారం సాయంత్రం, గురువారం ఉదయం వరకు 5, 7 డివిజన్లలోని నాజ్ సెంటర్, గుంటూరువారి తోట, పాత్తూరువారి తోట, గణేష్ రావు పేట, కొత్తపేట, రాజాగారితోట, రామిరెడ్డితోట 1 నుంచి 8 లైన్లు, గంటలమ్మ చెట్టు, చౌత్రా సెంటర్, పూల మార్కెట్, ఎల్బీ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయబడుతుంద పేర్కొన్నారు. గురువారం సాయంత్రం నుంచి తాగునీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని, నగర ప్రజలు సదరు అంశాన్ని గమనించి తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని, సహకరించాలని తెలిపారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



పశ్చిమ ఎమ్మెల్యే మాధవితో కలిసి పింఛన్లు పంపిణీ చేస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పెన్షనర్లకు ఉదయం 6 గంటల నుంచే వారి ఇంటి వద్దనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మహ్మద్ నసీర్ అహ్మద్‌లతో కలిసి పట్టాభిపురం, ఆనందపేట తదితర ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని 206 వార్డు సచివాలయాల పరిధిలో 27 కేటగిరీల వారీగా ఉన్న 59,403 మంది పింఛనుదారులకు ఏప్రియల్ నుంచి జూన్ వరకు నెలకు రూ.వెయ్యితో కలిపి రూ.40,87,60,000లను వారి ఇంటి వద్దనే 1,632 మంది వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పంపిణీ సజావుగా జరిగేలా పర్యవేక్షణకు 42 మంది నోడల్ అధికారులను నియమించి, ప్రతి గంటకు రిపోర్ట్ తీసుకొని వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గతంలో ప్రతి నెలా సుమారు రూ.17 కోట్లు పింఛన్ పంపిణీ చేస్తుండగా, ప్రస్తుతం సుమారు రూ.25 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో ఇచ్చిన అధికారాన్ని వారి సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ పెన్షన్ల పెంపు ద్వారా ముఖ్యమంత్రి ప్రతి ఇంటిలో పండగ వాతావరణం తెచ్చారన్నారు. ఎన్నికల హామీ మేరకు ఏప్రిల్ నుండే పెంపు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, వెంకట లక్ష్మి, ఎంహెచ్ఓ మధుసూదన్, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, నోడల్ అధికారులు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

59వ డివిజన్‌లో పింఛన్ల పంపిణీ



పింఛన్లు పంపిణీ చేస్తున్న వనమా నరేంద్రకుమార్, సచివాలయ సిబ్బంది

గుంటూరు మెడికల్ : పశ్చిమ నియోజకవర్గంలోని 59వ సచివాలయం ఆర్ అగ్రహారం సాయిబాబా గుడి ఎదురు సందులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వనమా నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల హామీని ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆధ్వర్యంలో పింఛన్ల పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. కేవలం ఓట్ల కోసం కాదు, పేద ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవడంలో కూడా ఎన్డీఏ కార్యకర్తలు సిద్ధంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో 18వ డివిజన్ అధ్యక్షుడు పుడతా నరసింహారావు, పెరుమాళ్ల పద్మనాభం, జనసేన నాయకులు ఉగ్గిరాల రాజా, రమణ, సచివాలయ సిబ్బంది వసంత రాజ్, కవిత, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో మానసిక ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర నీరేస్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్యకర జీవన శైలితో మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ జనరల్ మెడిసిన్ కన్సల్టెంట్ డాక్టర్ నీరేస్ రావెల పేర్కొన్నారు. సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగ ఆధ్వర్యంలో ''ఆరోగ్యం-జీవన శైలి మధ్య గల సంబంధం'' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ నీరేస్ మాట్లాడుతూ జంక్ ఫుడ్, ప్రాసెస్ చేసిన ఆహారాన్ని తీసుకోరాదని, ప్రతి రోజూ తప్పనిసరిగా 30 నిమిషాలు వ్యాయామం చేయాలన్నారు. రోజుకు 7-8 గంటల నిద్ర శారీరక, మానసిక ఆరోగ్యానికి అవసరమన్నారు. సాధ్యమైనంత వరకు మొబైల్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ యువత పాశ్చాత్య ధోరణిలోని అంశాలను అనుకరిస్తూ, జీవన విధానాన్ని మార్పు చేసుకుని ఆరోగ్యంపై అశ్రద్ధ చూపిస్తున్నారన్నారు. దీనికి పరిష్కారాన్ని చూపాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఎ.బాజీబాబు, ఎస్.మణికంఠ, అనిత, ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

- గుంటూరు ఏడీఏ సునీల్
- రూ.11.71 లక్షల విలువైన పురుగు మందులు సీజ్



పట్నంబజారులోని ఓ షాపులో స్టాక్ రిజిష్టరును పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్, ఏఓ సుబ్రహ్మణ్యం

కొరిటిపాడు(గుంటూరు): రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని వ్యవసాయశాఖ గుంటూరు సహాయ సంచాలకులు ఎం.సునీల్ సూచించారు. రైతులకు నాసిరకం, కల్తీ విత్తనాలు అంటగడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్నంబజారులోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపులను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. లైసెన్స్‌లు, స్టాకు రిజిస్టార్లు తనిఖీ చేసి గోడౌన్లలోని నిల్వలను పరిశీలించారు. పలు షాపుల్లో స్టాక్ బోర్డు, ధరల పట్టిక లేనందున, సరిగా అప్‌డేట్ చేయనందున రూ.11.71 లక్షల విలువ చేసే 2,125 లీటర్లు పురుగు మందుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఏడీఏ సునీల్ మాట్లాడుతూ రికార్డులు సక్రమంగా నిర్వహించకుండా, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకంపై రికార్డులు నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, నాసిరకమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్పీ మించి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఒకటికి రెండు సార్లు పరిశీలించి కొనుగోలు చేయాలన్నారు. గుంటూరు రూరల్ ఏఓ వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కొరటాల ఆశయాలను కొనసాగించాలి


నివాళులర్పించిన సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు



కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రామారావు

లక్ష్మీపురం: సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ ఆశయాలను కొనసాగించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. స్థానిక బ్రాడి పేటలోని జిల్లా కార్యాలయంలో సోమవారం సీపీఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన కొరటాల సత్యనారాయణ 18వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాశం రామరావు మాట్లాడుతూ కొరటాల గుంటూరు ఏసీ కళాశాలలో విద్యార్థి ఉద్యమంలో పనిచేశారన్నారు. సీపీఎం రేపల్లె తాలుకా, గుంటూరు జిల్లా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేశారని గుర్తు చేశారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయనం చేసి, సమస్యల పరిష్కారానికి పోరాటాలు నిర్వహించారని తెలిపారు. చల్లపల్లి జమిందారీ భూములు పేదలకు పంపిణీ చేయాలని, రొంపేరు బంజరు భూములు పేదలకు పంచాలని పోరాటాలు నడిపారన్నారు. కొరటాల స్ఫూర్తితో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఎంఏ చిస్టీ, ఈమని అప్పారావు, బెల్లగాని శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఖాశిం షహీద్, కిరణ్, వై.కష్ణకాంత్, సాంబశివరావు, వై.కష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాభారతంలోని సభాపర్వంపై ప్రవచనం



ప్రవచనం చేస్తున్న శ్రీకూర్మనాథ స్వామి

నగరంపాలెం: మహాభారతం అనేది పూరాణమని, పెద్దలు ఎంతగానో పరిశీలించి సమీక్షించి పురాణాలను, కథలను అందించారని శ్రీమాన్ గుదిమెళ్ళ శ్రీకూర్మనాథస్వామి అన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కల్యాణ వేదికపై మహాభారతంలోని సభా పర్వం జూద ఘట్టంపై సోమవారం ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకూర్మనాథస్వామి ప్రసంగిస్తూ జూదం సన్నివేశంలో ధర్మరాజు సమస్తం కోల్పోయారన్నారు. జూదంలో పాండవులు అయిదుగురిని పణంగా పెట్టి, తర్వాత ద్రౌపదిని కూడా పెట్టేందుకు ధర్మరాజు సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఈ క్రమంలో ద్రౌపదిని పణంగా పెట్టేందుకు ధర్మరాజుకు ఉన్న అధికారాన్ని ద్రౌపది అడగ్గా, ధర్మా..ధర్మాల విశేషాలను భగవత్ భక్తులకు ఆయన తెలిపారు.

దేశ ఆర్థిక ప్రగతిలో సీఏల పాత్ర కీలకం

ఘనంగా సీఏ దినోత్సవం



సీఏ దినోత్సవంలో ఐసీఏఐ ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ఆర్థిక ప్రగతిలో చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర ఎంతో కీలకమని చలపతి విద్యా సంస్థల అధినేత వైవీ ఆంజనేయులు పేర్కొన్నారు. శ్రీనివాసరావు తోటలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సీఏ దినోత్సవం సందర్భంగా పతాక ఆవిష్కరణ, రక్తదాన శిబిరం, మొక్కల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ సీఏ విద్యను ఎంపిక చేసుకోవడం బంగారు భవిష్యత్తుకు పునాది వేసుకోవడమన్నారు. సీఏ విద్యకు గుంటూరు ముఖ్య కేంద్రంగా ఉందని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ఎంతో మంది విద్యార్థులు సీఏ అభ్యశించేందుకు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, వైస్ చైర్మన్ చింతా రఘునందన్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, కోశాధికారి నరేష్, సికాస చైర్మన్ కన్నెగంటి మృత్యుంజయరావు, పాస్ట్ చైర్మన్ మద్ది రవితేజ, కమిటీ సభ్యురాలు వంగల భార్గవి, సీఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న కరస్పాండెంట్, అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సోమవారం కర్పూరపు వెంకట నారాయణ, పార్వతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.60వేలు విలువ గల నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ కర్పూరపు సూర్య నారాయణ ద్వారా విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. దాతల ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని, చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు లక్ష్మీ సుభద్ర, చంద్రశేఖర్, శ్రీధర్ పాల్గొన్నారు.

నబీసాహెబ్ కుటుంబానికి అండగా ఉంటాం



నగరంపాలెం: స్థానిక 15వ డివిజన్‌లో సోమవారం తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ పర్యటించారు. స్థానికంగా లబ్ధిదారులకు పెన్షన్‌లు పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై, శస్త్రచికిత్స అనంతరం బావాజీ నగర్‌లోని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వైద్య ఉద్యోగి షేక్.నబీసాహెబ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నబీసాహెబ్ కుటుంబానికి పూర్తిస్థాయిలో అండగా ఉంటామని ఎమ్మెల్యే భరోసానిచ్చారు.

అత్యుత్తమ వైద్య సేవలందించిన బిధాన్ చంద్రరాయ్



విద్యార్థులతో డాక్టర్ కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉత్తమ వైద్య సేవల కోసం కృషి చేసిన బిధాన్ చంద్రరాయ్..దేశం కోసం తన జీవితాని అర్పించారని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ స్కూల్లో సోమవారం పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, భారత రత్న డాక్టర్ బిధాన్ చంద్రరాయ్ జయంతి సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్యుల వస్త్రధారణతో అలరించారు. డాక్టర్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రెండవ సీఎంగా పని చేసిన డాక్టర్ బీసీ రాయ్ గొప్ప రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడన్నారు. చిత్తరంజన్ సేవా సదన్ పేరుతో ఆస్పత్రిని ఏర్పాటు చేసి, వైద్య సేవలు అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, ఏవో కె. వెంకట్రావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆరోగ్య పరిరక్షణలో ప్రజారోగ్య సిబ్బంది పాత్ర కీలకం



పదవి విరమణ చేసిన ప్రజారోగ్య సిబ్బందితో కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణలో నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది కృషి వెలకట్టలేనిదని నగర కమిషనర్ కీర్తి చేకూరి అన్నారు. సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న 12 మంది ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులకు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సన్మాన సభ ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పారిశుద్ధ్య పనులు చేస్తున్నారన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్న కార్మికులకు నగరపాలక సంస్థ తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నగరంలో ప్రజారోగ్య కార్మికులు లేకుంటే ప్రజారోగ్యం పెను ప్రమాదంలో పడుతుందన్నారు. ఉద్యోగ విరమణ చేసిన 12 మందికి నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పీఎఫ్ బెనిఫిట్స్ రూ.93,96,545లను అందించామని, ఇతర బెనిఫిట్స్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, ఎంహెచ్ఓ మధుసూదన్, ఎస్.ఈ శ్యాం సుందర్ పాల్గొన్నారు.

కళాశాలలో ఉచిత వైద్య శిబిరం



ప్రిన్సిపల్ సునీతకు ఆయుర్వేద మందులు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివ పేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం డాక్టర్స్ డే సందర్భంగా భాస్కర్ ఆయుర్వేద ఆస్పత్రి-పంచకర్మ కేంద్ర ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవైఎస్ భాస్కర్, డాక్టర్ లక్ష్మి శ్రావణి, డాక్టర్ గోకవరపు వెంకటకుమార్ పాల్గొని అధ్యాపకులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్య విశిష్టత, చికిత్సా విధానం వాటి వివరాలను అధ్యాపకులకు వివరించారు. వైద్య శిబిరంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సునీత, వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఆనంద్‌బాబు, సిరిపురం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాల మోహన్‌రావు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తితో పనిచేసిన పీటర్

నగరంపాలెం: విశాలాంధ్ర బుక్ హౌస్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయడం ఒక ఉద్యోగంలా కాకుండా ఉద్యమ స్ఫూర్తితో పీటర్ నిర్వర్తించారని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించి, ఆదివారం ఉద్యోగ విరమణ పొందిన ఆర్.పీటర్ అభినందన సభ సోమవారం అవగాహన సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. సభకు అభ్యుదయ రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ అధ్యక్షత వహించారు. సాహిత్య సంస్థల ప్రతినిధులు, పుస్తక ప్రియులు పీటర్ సేవలను అభినందించారు. సంస్థ కార్యదర్శి కె.శివరామిరెడ్డి, కాపు శ్రీనివాస్, జి.శాంతకుమార్, ఆర్.శేషయ్య, ఎస్.ఎం.సుభాని, కె.శివప్రసాద్, సీపీఐ నాయకులు రావుల అంజిబాబు, పెనుమాక నాగేశ్వరరావు, శరత్, విశాలాంధ్ర సిబ్బంది బాషా, శ్రీనివాసరావు పాల్గొన్నారు.